మహిళలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు శిల్ప

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా నెరవేర్చలేదని బీజేపీ రాష్ట్ర మహిళామోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ, మహిళలకు అండగా మంగళవారం ధర్నా చేపట్టనున్నట్టు వెల్లడించారు.

క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి

హైదరాబాద్, జూలై7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. టీ 20 ప్రపంచకప్ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సత్కరించి అభినందిస్తుంటే తెలంగాణ ముఖ్యమంత్రి హైదరాబాద్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను విస్మరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రతి నియోజకవర్గానికి క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలని నాయకులు రామకృష్ణ, హరీశ్, జగదీశ్, భగత్, వినయ్, ప్రవీణ్, అర్జున్ డిమాండ్ చేశారు.

నేడు విజయవాడకు సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు వెళ్లనున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3:15 గంటలకు ప్రత్యేక విమానంలో బయల్దేరి, రాత్రికి తిరిగి హైదరాబాద్ రానున్నారు. ముఖ్యమంత్రితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ విజయవాడకు వెళ్లనున్నట్టు తెలిసింది.

ప్రజాపాలనా? రెడ్డి పాలనా?

మొదటిపేజీ తరువాయి...

రేపుతున్నాయి. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి..'మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్‌రెడ్డిని గెలిపిస్తే ముదిరాజ్ బిడ్డను మంత్రిగా చేసే బాధ్యతను తీసుకుంటానని ప్రకటించారు'. రాష్ట్రంలో ముదిరాజ్ కులం నుంచి గెలిచిన ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రి సొంత జిల్లాకు చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాత్రమే ఉండడంతో ఆయనకు మంత్రి పదవి ఖాయమని అందరూ భావించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కూడా తనకు అమాత్యయోగం పక్కాఅని లెక్కలు వేసుకున్నారు. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు తారుమారయ్యాయి. ఎంపీగా డీకే అరుణ గెలుపొందడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనంగా ఉన్నట్టు తెలిసింది. దీనికంతటికీ మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని ఎమ్మెల్యేలే కారణమని సీఎం రుసరుసలాడినట్టు సమాచారం. ముదిరాజ్ సామాజిక వర్గం ఓట్లన్నీ కాంగ్రెస్‌కు పడతాయని భావించినా.. కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాజయం తప్పలేదు. దీన్ని సాకుగా చూపి వాకిటి శ్రీహరికి మొండిచెయ్యి చూపించినట్టు తెలిసింది.

జాబితాలో వాకిటి పేరు గల్లంతు

ఇటీవల మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ఊహాగానాలు వచ్చిన నేపథ్యంలో ఢిల్లీకి పంపించిన జాబితాలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేరు గల్లంతయ్యింది. బహిరంగంగా ప్రకటించి జాబితాలో తన పేరు లేకపోవడంపై ఆయన కంగుతిన్నారు. ముదిరాజ్ బిడ్డకు మంత్రి రాకపోవడం ఏమిటని



ఎమ్మెల్యే శ్రీహరి పేరుతో పెట్టిన పోస్టు

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన అనుచరులతో వాపోయారు. మంత్రివర్గ విస్తరణలో సీఎం తన వర్గానికే ప్రాధాన్యత ఇవ్వడంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలంతా అవాక్కయ్యారు. ఢిల్లీలోనే ఉండి మక్తల్ ఎమ్మెల్యే ఓ వాట్సాప్ గ్రూపులో పెట్టిన పోస్ట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 'సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం ఓఎస్‌డీ అజిత్‌రెడ్డి, సీపీఆర్‌వో అయోధ్యరెడ్డి' అంటూ రెడ్డిల పేర్లను ఊటంకిస్తూ దాదాపు 33 మంది రెడ్డిల పేర్లను పోర్ట్‌ఫోలియోలను పోస్ట్‌లో ప్రస్తావించారు. ఇది ప్రజా పాలననా.. రెడ్డిల పాలననా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి పాలయ్యిందిరో తెలంగాణ అంటూ పోస్ట్‌ను ముగించారు. దీనిపై ఇంటలిజెన్స్ వర్గాలు హుటాహుటిన సీఎంవోకు సమాచారం అందించాయి. ఏమైందో ఏమో కానీ నిమిషాల్లోనే పోస్టును డిలీట్ చేశారు. అయితే, అప్పటికే కొందరు ఈ పోస్టులను స్క్రీన్‌షాట్లు తీసి వాట్సాప్ గ్రూపులో వైరల్ చేస్తున్నారు. కాగా, ఈ విషయంపై మక్తల్ ఎమ్మెల్యేను వివరణ కోరేందుకు ప్రయత్నించగా బిజీగా ఉన్నట్లు పీఏ సమాచారం అందించారు. ఇదిలా ఉంటే హస్తం సింబల్‌తో గెలిచిన బీసీ ఎమ్మెల్యేలంతా ఒక తాటిపైకి రావాలని ప్రత్యేక గ్రూప్‌ను కూడా క్రియేట్ చేసినట్టు సమాచారం. ఈ గ్రూప్‌లో సీఎం రేవంత్‌రెడ్డిపై ఘాటు విమర్శలు చేసుకుంటున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే శ్రీహరి అనుచరులు రెడ్డిలపై గరంగరమవుతున్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓడిపోగానే ఏకంగా ప్రెస్‌మీట్ పెట్టి అగ్రవర్ణాలపై విరుచుకుపడ్డారు. పరోక్షంగా ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిలపై దుమ్మెత్తిపోశారు.

బీసీ నేతల్లో కట్టలు తెంచుకున్న ఆగ్రహం..

ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నుంచి ఏడు సెగ్మెంట్లలో రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వెలమ సామాజికవర్గానికి చెందిన జూపల్లి కృష్ణారావుకు ఏకంగా మంత్రి పదవి కట్టబెట్టారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బీసీ వర్గానికి చెందిన వారు. సొంత జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎంగా పగ్గాలు చేపట్టడంతో ఉమ్మడి జిల్లా నేతలంతా సంతోషపడ్డారు. కాగా, వనపర్తి మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డికి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి ఇవ్వడం.. అదే నియోజకవర్గానికి చెందిన శివసేనారెడ్డికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, సీఎం సొంత నియోజకవర్గానికి చెందిన గుర్నాథ్‌రెడ్డికి పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కేటాయించినట్టు ప్రచారం జరిగింది. వీరందరూ రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కావడంతో బీసీలంతా నిరాశకు గురయ్యారు. ఇక ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కూడా బీసీలను కాదని జీవన్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. ఇక ఎంపీ టికెట్‌ను కూడా చల్లా వంశీచందర్‌రెడ్డికి కట్టబెట్టారు. దీంతో బీసీలంతా ఏకమై ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్‌ను మట్టి కరిపించారు. పార్టీ కోసం కష్టపడిన చాలామంది నేతలు పదవులు వస్తాయని ఆశించి భంగపడ్డారు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు బీసీ ఎమ్మెల్యేలు ఉన్నా.. ఆయా నియోజకవర్గాల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ద్వితీయ శ్రేణి నేతలను ఇన్‌చార్జులుగా పెట్టి బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని సొంత పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మక్తల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చినట్లు ఆశ చూపి లిస్ట్‌లో పేరు లేకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లా పర్యటనకు వస్తున్న సీఎంకు బీసీ నేతల తిరుగుబాటు కలవరపాటుకు గురిచేస్తున్నది.

మంత్రులకు ల్యాండ్ క్రూయిజర్లు

- ఒక్కొక్కరికి ఒక్కొక్కటి కేటాయింపు!
- ప్రజాప్రతినిధుల రక్షణ కోసమే తీసుకున్న నాటి ప్రభుత్వం
- నాడు తిట్టి.. నేడు పంచుకున్న మంత్రులు

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర మంత్రులకు కొత్తగా ల్యాండ్ క్రూయిజర్ కార్లను ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్ కేటాయించింది. ఒక్కొక్క మంత్రికి ఒక్కో కారు చొప్పున కేటాయించినట్టుగా తెలిసింది. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం నూతనంగా అత్యాధునిక వ్యవస్థ కలిగిలిన బుల్లెట్ ప్రూఫ్ కార్లను సీఎం సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ వింగ్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం నానా రభస చేసింది. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని దుమ్మెత్తిపోశారు.

నాడు వ్యతిరేకించిన సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ వాహనాల కొనుగోలుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డిసెంబర్ 28, 2023న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తాను కొత్త బండ్లు కొనన్నని, కొత్తగా ఖర్చుపెట్టేందుకు సుముఖత వ్యక్తం చేయనని చెప్పారు. 22 ల్యాండ్ క్రూయిజర్లు కొని మాజీ ముఖ్యమంత్రి దాచిపెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. ఒక్కొక్క బండికి సుమారు రూ.3 కోట్లు ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చు అవసరమా? అంటూ గత ప్రభుత్వంపై నెపం వేశారు. ఇటీవల ఓ మంత్రి కొత్త ల్యాండ్ క్రూయిజర్ వాహనానికి పూజలు నిర్వహించడంతో.. సీఎం రేవంత్‌రెడ్డి డిసెంబర్‌లో మాటలను ఊటంకిస్తూ కొందరు నెటిజన్లు పోస్టులు పెట్టారు. ముఖ్యమంత్రి, మంత్రులు తిరగాల్సిన వాహనాలను సెక్యూరిటీ వింగ్, ఇంటెలిజెన్స్ విభాగం పరిశీలిస్తుంటుందని, వాహనాల కెపాసిటీ, బుల్లెట్ ప్రూఫ్ వంటివి రహస్యంగానే ఉంచుతారనే విషయం తెలియదా అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. అలాంటి విషయాన్ని సైతం సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాలకు వాడుకున్నారని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

భద్రత కోసమే..

మంత్రుల భద్రత కోసం అత్యాధునిక వాహనాలు కావాలని ఇంటెలిజెన్స్ విభాగం చేసిన సూచనల మేరకు నాడు ముఖ్యమంత్రిగా ఉన్న కే.చంద్రశేఖర్ రావు ఆమోదం తెలిపారు. ఒక ల్యాండ్ క్రూయిజర్ కార్‌కు బుల్లెట్ ప్రూఫ్ చేయడం వల్ల మొత్తం రూ.3 కోట్ల ఖర్చు అవుతుంది. శత్రువులు దాడి చేసినా, బ్లాస్ట్‌లకు పాల్పడినా.. ఈ బుల్లెట్ ప్రూఫ్ సమర్థంగా రక్షిస్తుంది. ప్రజాప్రతినిధుల రక్షణ కోసం వీటిని సీఎం సెక్యూరిటీ వింగ్, ఇంటెలిజెన్స్ విభాగం, ప్రొటోకాల్ విభాగం వీటిని వినియోగించాలని సూచిస్తుంది. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటెలిజెన్స్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపి, నిధులు విడుదల చేశారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ఎల్పీ విలీనం తథ్యం

- నిరంజన్‌రెడ్డిని జైలుకు పంపిస్తాం
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నుంచి బాజాప్తాగా 26 మంది ఎమ్మెల్యేలను తీసుకొని కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేస్తామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చెప్పారు. కాంగ్రెస్ పార్టీపై నిత్యం ఆరోపణలు చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తమ కాలి గోటికి కూడా సరిపోడని వ్యాఖ్యలు చేశారు. నిరంజన్‌రెడ్డికి సమాధానం చెప్పాలంటే తమ ఎంపీటీసీలు కూడా ఎక్కువేనని అన్నారు. ఆదివారం సీఎల్పీలో దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డితో కలిసి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి స్వచ్ఛమైన పాలన అందిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఆయన చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే నిరంజన్‌రెడ్డి విమర్శలు చేస్తారా ? అని ప్రశ్నించారు. మంత్రిగా నిరంజన్‌రెడ్డి అక్రమాలపై ఏసీబీ వంటి దర్యాప్తు సంస్థలకు లేఖలు ఇచ్చేందుకు సిద్ధమని హెచ్చరించారు. నిరంజన్‌రెడ్డి అవినీతిని నిరూపించి తీహార్ జైలుకు పంపిస్తామని ఘాటుగా వ్యాఖ్యానించారు.

సుస్థిర ప్రభుత్వం కోసమే చేరికలు

- ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ఫిరాయింపులు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉండాలన్న ఉద్దేశంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేసేలా బీఆర్ఎస్, బీజేపీ నేతలు మాట్లాడారని, దీంతో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు పార్టీలోకి చేరికలను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని ఆనాడు వారు చెప్పబట్టే.. ముందుగా తాము జాగ్రత్తపడుతున్నామని వివరించారు. ఆదివారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలను తిప్పికొట్టేందుకే ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి లేఖ రాయడాన్ని తప్పుపట్టారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని విమర్శించే స్థాయి నిరంజన్‌రెడ్డికి లేదని దుయ్యబట్టారు. మహాభారతంలో ధర్మరాజు ధర్మ సంస్థాపన కోసం అశ్వత్థామ హతః కుంజరః అని అన్నాడని, తాము కూడా అదే విధానం అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. నాడు ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి చేర్చుకొని రాజ్యాంగ స్ఫూర్తిని బీఆర్ఎస్ తుంగలో తొక్కిందని విమర్శించారు. 'ఇప్పుడు ప్రజాపాలన పేరుతో మీరు కూడా రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్నారా?' అని మీడియా అడిగిన ప్రశ్నకు మంత్రి జూపల్లి తడబడ్డారు. పార్టీ ఫిరాయింపులను తాము ప్రోత్సహించడం లేదని, ఎమ్మెల్యేలే తమ పార్టీలోకి వస్తున్నారని చెప్పారు. 'ఇట్ ఈజ్ పార్ట్ ఆఫ్ అవర్ డ్యూటీ' అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని కూలుస్తామంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని చెప్పారు. నిరంజన్‌రెడ్డి అవినీతి, అక్రమాలు, కబ్జాల గురించి ప్రజలకు తెలుసునని, అందుకే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనను ఓడించారని తెలిపారు.

నిరంజన్‌రెడ్డి చరిత్ర బయటపెడతాం

అతి త్వరలోనే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అవినీతి చరితను బయటపెడతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి మనుగడ లేదని కార్యకర్తలే తమ ఎమ్మెల్యేలను పార్టీ మారేలా ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. విభజన సమస్యల పరిష్కారానికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు సమావేశమయ్యారని పేర్కొన్నారు.

బీజేపీతో టచ్‌లో 26 మంది ఎమ్మెల్యేలు

- రాజీనామా చేయాలనే నిబంధనతో సంకోచిస్తున్నరు
- అధ్యక్ష మార్పు అంశం హైకమాండ్ పరిధిలోనిది
- కరీంనగర్‌లో కేంద్రహోంశాఖ సహాయ మంత్రిబండి సంజయ్

విద్యానగర్, జూలై 7: రాష్ట్రంలోని 26 మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వాఖ్యలు చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఇతర పార్టీల తరపున గెలిచిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు బీజేపీలోకి రావాలంటే తప్పనిసరిగా ఆ పదవులకు రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. దీంతో తర్జనభర్జన పడుతున్నారని చెప్పారు. ఈడీ, సీబీఐ సంస్థల విచారణకు, బీజేపీకి సంబంధమే లేదని, మోదీ ప్రభుత్వం అవినీతి పరులను ఉపేక్షించే ప్రసక్తే లేదని చెప్పారు. ఎంపీ కేశవరావుతో రాజీనామా చేయించిన కాంగ్రెస్ నేతలు, ఆ పార్టీలో చేరిన ఇతర పార్టీల ఎమ్మెల్యేలతో ఎందుకు చేయించలేదో చెప్పాలని నిలదీశారు. బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ మార్పు, నూతన అధ్యక్షుడి ఎంపిక అంశం పార్టీ జాతీయ నాయకత్వం చూసుకుంటుందని చెప్పారు. ఇరు రాష్ట్రాల సీఎంలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే విభజన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు.

ఖమ్మం నగరంలోని సీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నేతలు

రైతు ప్రభాకర్ తండ్రిని ఓదార్చుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

రైతులకు అన్యాయం చేస్తే అగ్గిపుట్టిస్తం

- తహసీల్దార్, సీఐ నిర్లక్ష్యం వల్లే ప్రభాకర్ ఆత్మహత్య
- ప్రభాకర్ కుటుంబానికి అండగా నిలుస్తాం
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- బాధిత కుటుంబానికి రూ. 2 లక్షలు అందజేత

ఖమ్మం, జూలై 7 (నమస్తే తెలంగాణ, ప్రతినిధి): రాష్ట్రంలోని ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా అగ్గిపుట్టిస్తామని జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరులో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు ప్రభాకర్ కుటుంబాన్ని ఆదివారం నేతలు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ప్రభాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రూ. 2 లక్షల నగదును సాయంగా అందించారు. అనంతరం మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి పల్లా మీడియాతో మాట్లాడారు. రెవెన్యూశాఖలో అవినీతి పెరిగిపోయిందని, డబ్బులు ఇవ్వనిదే అధికారులు ఏ పనిచేయడం లేదని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు, పోలీసుల నిర్లక్ష్యం వల్లే ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి సహా పలువురు మంత్రులు నాలుగు చేతులా సంపాదిస్తున్నారని మండిపడ్డారు. 40 ఏండ్లుగా భూమిని సాగుచేసుకుంటూ 11సార్లు రైతుబంధు తీసుకున్న ప్రభాకర్ భూమికి ట్రెంచ్‌కొట్టి చెరువులో కలపడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. చట్టబద్ధంగా ఉన్న ప్రభాకర్ 7.1 ఎకరాలను రక్షించలేని రెవెన్యూ యంత్రాంగం ఉండి ఎందుకని ప్రశ్నించారు.

ఆదరాబాదరాగా భట్టి పరామర్శ

ప్రభాకర్ ఆత్మహత్య చేసుకుని వారం రోజులైనా పరామర్శించని డిప్యూటీ సీఎం భట్టి తాను, హరీశ్‌రావు వస్తున్నామని తెలిసి ఆదరాబాదరాగా వచ్చి కంటితుడుపు చర్యగా పరామర్శించి వెళ్లడం బాధాకరమని పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభాకర్ ఆత్మహత్యకు కారణమైన తహసీల్దార్, సీఐని తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతోపాటు పిల్లలకు అండగా నిలవాలని కోరారు. ప్రభాకర్ ఆత్మహత్యకు కారణమై, ఏ1గా ఉండాల్సిన నిందితుడిని భట్టి విక్రమార్క తన కారులో తిప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ కేసుతో ఎలాంటి సంబంధమూ లేని గ్రామ పెద్ద పుల్లయ్యపై కేసు పెట్టించి ఇబ్బందులు పెట్టడాన్ని దుర్మార్గచర్యగా అభివర్ణించారు. అన్యాయంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు చింతకాని మండలం వచ్చారని, దళితబంధు పథకాన్ని ఇక్కడి నుంచే పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారని గుర్తుచేశారు.

'నమస్తే' వార్తకు స్పందించిన ప్రభుత్వం

అధికారుల నిర్లక్ష్యంతో రైతు ప్రభాకర్ ఆత్మహత్య చేసుకుని వారం రోజులు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదంటూ 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఆదివారం కథనం ప్రచురితమైంది. ఆదివారం బీఆర్ఎస్ నాయకుల బృందం బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లబోతున్నదని పేర్కొంది. దీంతో స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారిక షెడ్యూల్‌లో లేకపోయినప్పటికీ ఆదివారం ప్రొద్దుటూరు వెళ్లి ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. నిందితులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. అయితే, ఆ వెంటనే ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కూరపాటి కిశోర్ ఇంటికి భట్టి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

బీఆర్ఎస్ ప్రతినిధుల బృందానికి తప్పని నిరీక్షణ

ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించాలని నిర్ణయించిన బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ శనివారం ప్రజాప్రతినిధుల బృందాన్ని ఎంపిక చేసింది. పరామర్శకు వస్తున్న విషయాన్ని ప్రభాకర్ కుటుంబ సభ్యులకు తెలియజేయడంతోపాటు రెవెన్యూ, పోలీసు అధికారులకు బీఆర్ఎస్ నేతలు ముందస్తు సమాచారం అందించారు. ఉదయం 9:30 గంటలకు గ్రామానికి వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధంకాగా డిప్యూటీ సీఎం వస్తున్నారని కొంత సమయం వేచి ఉండాలని పోలీసులు సూచించడంతో దాదాపు రెండుగంటల పాటు వారు పార్టీ కార్యాలయంలో నిరీక్షించాల్సి వచ్చింది.

ప్రభాకర్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

రైతు ప్రభాకర్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కలిసి వినతిపత్రం అందించింది. ప్రభాకర్ ఆత్మహత్యకు గల కారణాలు, ప్రేరేపించిన అంశాలు, కేసు నమోదులో జరిగిన పరిణామాలను సీపీకి వివరించారు. కాంగ్రెస్ నాయకుడు కూరపాటి కిశోర్ ప్రమేయం, ఆయన వల్ల తనకు జరిగిన నష్టంపై రైతు ప్రభాకర్ వీడియోలో వెల్లడించాడని, అయినప్పటికీ కిశోర్ పేరును ఎఫ్ఐఆర్‌లో 12వ పేరుగా నమోదు చేశారని సీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ నాయకులను ఏ1, ఏ3లుగా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారని ఆరోపించారు. పెద్దమనిషిగా వెళ్లిన పుల్లయ్యపై కేసు నమోదు చేయడం దారుణమని, కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అన్ని విషయాలను విన్న సీపీ ప్రభాకర్ మృతిపై లోతైన విచారణ జరిపి, నిందితులకు శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, తాతా మధుసూదన్, లింగాల కమల్‌రాజు, సండ్ర వెంకటవీరయ్య, పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా ఇవ్వని 'భట్టి'